
సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



వాటర్‌షెడ్‌లో నిధుల దుర్వినియోగం

పెద్దతిప్పసముద్రం మండలం మడుమూరు పంచాయతీలో వాటర్‌షెడ్ ద్వారా జరుగుతున్న పనులు, నిధుల దుర్వినియోగంపై వాటర్‌షెడ్ చైర్మన్ శ్రీనివాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. - 8లో



పలు రైళ్లు ఇక హాల్టింగ్

దక్షిణమధ్య రైల్వేలో పలు రైళ్లకు హాల్టింగ్స్‌ను పునరుద్ధరిస్తూ సౌత్‌సెంట్రల్ రైల్వే సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జయంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాలింగ్ ఇచ్చారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.200	రూ.250
రెండోరకం	రూ.140	రూ.190

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 119 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వైభవం..పల్లకీ ఉత్సవం



రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేశారు. సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు ఆలయాన్ని తెరిచారు. ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి స్వామి, అమ్మ వారిని అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. మాఢవీధులు, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా పోలీసు అధికారులు అలస్వం చేయరాదని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలియపరిచారు. సోమవారం రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులకు వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమపేరుతో మోసం తదితర సమస్యలపై ఫిర్యాదుదారులు నుంచి అర్జీలు అందాయని ఆయన తెలిపారు.సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వరం బాధితులకు చట్టపరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు సమావేశం

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు డీవీఈఓ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడిజిల్లా అండర్ 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమోహన్‌రాజు తెలిపారు. ఎస్‌జీఎఫ్‌ఐ అండర్ 19 స్కూల్ గేమ్స్ సంబంధించి జిల్లా జట్లను ఎంపిక చేయడం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని మేనేజ్‌మెంట్లకు సంబంధించిన పీడీ, పీఈటీ, ఇన్‌చార్జ పీడీలు తప్పకుండా హాజరు కావాలని ఆయన తెలిపారు. వివరాలకు 9290760996 సంప్రదించాలని కోరారు.

జాతీయస్థాయి యోగాసన పోటీలకు ఎంపిక

వేంపల్లె : జాతీయస్థాయి యోగాసన పోటీలకు ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికై నట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విభాగంలో చదువుతున్న విద్యార్థులు బి.నాగ పవన్, ఎస్.అరవింద్, జి.విజయ్ కుమార్, డి.రవితేజ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని సత్తా చాటారని వెల్లడించారు. ఈనెల 11వ తేదీ నుండి 14వ తేదీ వరకు చత్తీష్‌ఘట్ బిలయోలో నిర్వహించే యోగాసన భారత్ జాతీయ స్థాయిపోటీల్లో పాల్గొననున్నారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై డైరెక్టర్‌తో పాటు పరిపాలన అధికారి రవికుమార్, డీన్ రమేష్ కైలాస్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

పడిగాపులు..పాట్లు



- ఎరువుల కోసం అన్నదాతకు తప్పని తిప్పలు
- నేడు రైతు సమస్యలపై వైఎస్సార్ సీపీ అన్నదాత పోరుబాట



నిమ్మనపల్లె : యూరియా కోసం నమోదు చేసుకుంటున్న రైతులు

సాక్షి, రాయచోటి : అన్నదాతకు అనుక్షణం కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు ప్రకృతి అల్లకల్లోలం చేస్తే, మరోవైపు ప్రభుత్వం కష్టాలు చూపిస్తోంది. పంటలు పండక... చేసిన అప్పులు తీర్చే మార్గం లేక రైతు కుంగిపోతున్నాడు. అయితే ఆపదలో ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఇప్పటికీ చేష్టలుడిగి చూస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. ప్రతిసారి విత్తనం మొదలు..కాయ కోసే వరకు అగచాట్లు తప్పడం లేదు. పంట పండిన తర్వాత గిట్టుబాటు ధర లేక పండ్ల తోటరైతుల బాధలు వర్ణనాతీతం. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పూర్తిగా కరువు బారిన పడింది. అయితే ప్రత్యామ్నాయం వైపు అడుగులు వేస్తున్న అన్నదాతకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించే పరిస్థితి కనిపించడం లేదు. వరితోపాటు ఇతర పంటలకు వినియోగించే యూరియా సమస్యలు కూడా వెంటాడుతున్నాయి. కొన్నిచోట్ల క్యూలైన్లలో నిలబడినా ప్రయోజనం లేకపోవంతో రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి సుమారు 1,30,000 ఎకరాల వరకు పంటలు సాగు కావాల్సి ఉండగా, ఈసారి కేవలం పది వేలలోపు మాత్రమే పంటలు సాగయ్యాయి. అది కూడా అరకొరగా వేరుశనగ, మినుము, వరి, జొన్న, పత్తి, కంది పంటలు సాగయ్యాయి. అయితే జిల్లాలో అధికంగా సాగయ్యే పంటల్లో ప్రధానంగా వేరుశనగ కాగా, వరిది రెండవ స్థానం. అయితే విపత్కర పరిస్థితుల పుణ్యమా అని పంట సాగే కష్టంగా మారింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ప్రత్యామ్నాయం దృష్టి సారించిన అన్నదాత తల మీద ఎరువుల బారం పడుతోంది. యూరియా అంతంత మాత్రంగా ఉండగా, మరోప్రక్క అనేక రకాల ఆంక్షలతో రైతులకు అందడం గగనంగా మారుతోంది. మొదట్లో డీఏపీ, ఇతర ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని మెలికపెట్టిన వ్యాపారులు, తర్వాత అధికారుల ఒత్తిడితో కొంతమేర తగ్గారు. అయితే మొదట్లో అధిక ధరలకు కూడా విక్రయాలు సాగాయి. ప్రస్తుతం యూరియా కోసం పలుచోట్ల బారులు తీరుతున్నారు.

కరువులతో కకావికలం

జిల్లాను కరువు పరిస్థితులు వెంటాడుతున్నాయి. 2024లోనూ కొంతమేర వర్షం పడటం, ఆ తర్వాత పడకపోవడంతో వేసిన పంటలు నిలువునా ఎండిపోయి రైతులు నష్టపోయారు. ఈసారి ఏకంగా వర్షపు ఛాయలు దరిదాపుల్లో కనిపించలేదు. ఆకాశం మేఘావృతం కావడం....తూతూ మంత్రంగా తుపాను జల్లులతో పదునుకే కష్టమై పోయింది. దీంతో అదును దాటుతున్నా పదును వర్షం కోసం ఎదురుచూసి విసిగిపోయారు. కానీ పదును లేదు...విత్తనం పడింది లేదు...దీంతో ఎక్కడ చూసినా బీడు భూములు దర్శనమిస్తున్నాయి.

పండ్ల తోటల రైతులకు దొరకని గిట్టుబాటు

జిల్లాలో మామిడి, బొప్పాయి, టమాటా, కర్భూజ, అరటి పంటలు విస్తారంగా సాగు చేస్తారు. అయితే రైతులకు ప్రతిసారి పంట పండించిన తర్వాత గిట్టుబాటు గగనంగా మారుతోంది. వాణిజ్య పంటలైన వేరుశనగ, ఇతర పంటలు కూడా గతంలో ధరలు లేక రైతులు అల్లాడిపోయారు. ఇటీవలి కాలంలో పండ్ల తోటల రైతులు సతమతమవుతున్నారు. మొన్నటివరకు మామిడి రైతులు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోగా, ప్రస్తుతం బొప్పాయి రైతులు భగ్గుమంటున్నారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిలువునా ముంచేస్తున్నారు. దీంతో గిట్టుబాటు ధర లభించకపండ్ల తోటల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

నేడు వైఎస్సార్ సీపీ అన్నదాత పోరు

రైతులకు సకాలంలో యూరియాతోపాటు మిగతా ఎరువులు అందించడంలో కూటమి సర్కార్ విఫలమైన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సంకల్పించింది. ప్రధానంగా రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాటకు పిలుపునిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలతోపాటు నియోజకవర్గాలు, ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు జరగనున్న తరుణంలో అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి కలెక్టరేట్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. జాతీయ రహదారి వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం ఉన్నతాధికారులకు వినతిపత్రాన్ని సమర్పించనున్నారు. ఇప్పటికే ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జిలు పోస్టర్ల ఆవిష్కరణ చేపట్టి రైతులను భారీగా తరలి రావాలని పిలుపునివ్వడంతో పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు రాయచోటి కలెక్టరేట్‌కు చేరుకోనున్నాయి. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు పార్టీ వర్గాలు తెలియజేశాయి.

రైతుల కష్టాలు పట్టని ప్రభుత్వం

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : రైతులకు న్యాయం చేయడంలో బాధ్యతగా ఉండాల్సిన కూటమి ప్రభుత్వం రైతుల బాధలు, కష్టాలను పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో రైతులపట్ల ప్రభుత్వ మొండి వైఖరిని తుర్పారా బట్టారు. రైతు భరోసా ఒకటిన్నర సంవత్సరానికి రూ.7 వేలు మాత్రమే ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కాకుండా సంవత్సరానికి రూ. 20 వేలు ఇస్తామని, ఎన్నికల సమయంలో కూటమి పార్టీ నేతలు చెప్పారన్నారు. ఈ సంవత్సరంతో కలిపి రైతులకు ఇంకా రూ. 33 వేలు బాకీ పడ్డారన్నారు. వీటిని వెంటనే రైతులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు వేసుకోలేని దుర్భర పరిస్థితులు జిల్లాలో ఏర్పడ్డాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 15శాతమే పంటలు సాగయ్యాయన్నారు. 85 శాతం సాగు చేయాల్సిన భూములు బీళ్లుగా మారాయన్నారు. ఈ ఏడాది మామిడి, టమాట, కర్భూజ, దోస తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టాలను మూటకట్టుకున్నారని తెలిపారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటల బీమా మంజూరు ఊసేలేదన్నారు. తోతాపూరి మామిడిరైతులు ఖాతాలలో డబ్బులు జమ చేస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేయాలి

రాష్ట్రంలో అనేక జిల్లాల్లో యూరియా కొరత నెలకొంది. దీంతో యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు ఈనెల 9న ఉదయం 9.30 గంటలకు అన్నదాత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని రైతు నాయకులు, రైతులు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మధుసూదన్ రావు

రాయచోటి : ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించే విషయంలో బ్యాంకర్లు ప్రధాన పాత్ర పోషించాలని డీఆర్‌ఓ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో డీఆర్‌ఓ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ (డీఆల్‌ఆర్‌సీ) బ్యాంకర్స్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వంతోపాటు బ్యాంకింగ్ రంగం భాగస్వామ్యం కావాలన్నారు. స్వయం ఉపాధికోసం రుణాల అందజేతకు చర్యలు, వ్యవసాయానికి పంట రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల చేరికను పెంచడం, మహిళా స్వయం సహాయక సంఘాలకు లక్ష్యం మేరకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు కీలకపాత్ర పోషించాలని డీఆర్‌ఓ సూచించారు.కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, ఆర్‌బీఐ ఎల్‌డీఓ వీన్ కుమార్, స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ కోటిరెడ్డి, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్, నాబార్డు డీడీఎం విజయ విహారి, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ బాషా, కేడీసీసీ బ్యాంక్ సీఈఓ రాజమణి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని కలెక్టరేట్ పీజీఆర్ ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం డీఆర్‌ఓ మధుసూదరావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, ఏడీ సర్వేయర్ భరత్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ లక్ష్మీపతి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి దాసరి నాగార్జునతో కలిసి మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో రాయచోటిలోని శ్రీ శివ నర్సింగ్ కాలేజీలో ఈ నెల 10వ తేదీన ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున తెలిపారు. ఈ ఉద్యోగమేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9550104260, 9177143181, 8897776368 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వరాలందించే ఆరోగ్యమాత



ముగింపు ఉత్సవాలకు హాజరైన విశ్వాసులు



విశేష అలంకారంలో ఆరోగ్యమాత స్వరూపం

- విశాఖ విశ్రాంత అగ్ర పీఠాధిపతులు మల్లవరపు ప్రకాశ్
- ఘనంగా ముగిసిన ఆరోగ్యమాత ఉత్సవాలు

కడప సెవెన్‌రోడ్స్ : విశ్వసించిన వారికి వరాలు, దీవెనలు అందించి పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ఆరోగ్యమాత అందజేస్తుందని విశాఖ విశ్రాంత అగ్ర పీఠాధిపతులు మల్లవరపు ప్రకాశ్ అన్నారు. కడప నగరం రైల్వేస్టేషన్ సమీపంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నవదిన పూజ ప్రార్థన దినోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నగరంలో ఆరోగ్యమాత ఉండడం రాయలసీమ ప్రాంతానికి ఆశీర్వాదకరమని, పది రోజులుగా ఆరోగ్యమాత నవదిన పూజా ప్రార్థనలు వైభవంగా జరిగాయన్నారు. సాయంత్రం 6 గంటలకు ఆయన ఆరోగ్యమాత పతాక అవరోహణ చేశారు. రెవరెండ్ ఫాదర్ బి.జ్వాన్సేస్, రెవరెండ్ ఫాదర్ డేవిడ్‌రాజు పరిశుద్ధ జపమాల, దివ్యసత్ప్రసాద ఆశీర్వాదం చేశారు. ఉత్సవాల్లో జి.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎర్రగుడిపాడుకు చెందిన ఏసన్న బృందం చెక్కభజన భక్తులను ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో గురువులు ఎండీ ప్రసాద్‌రావు, ఇతర గురువులు, కన్యస్త్రీలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

దేవగుడి X పోట్లదుర్తి

- గండికోటలో పనులు అడ్డుకుంటున్న ఎమ్మెల్యే ఆది వర్గం
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన పోట్లదుర్తి నాయకులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

టాస్క్‌ఫోర్సు : జమ్మలమడుగు నియోజకవర్గంలో ఆధిపత్య పోరు రోజు రోజుకు ఎక్కువవుతోంది. నియోజకవర్గంలో 'పోట్లదుర్తి బ్రదర్స్' ఎక్కడ పనులు చేపట్టిన ఆ పనులు అడ్డుకోవడం దేవగుడి బ్రదర్స్ అయిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి పరిపాటిగా మారిపోయింది. పర్యాటక కేంద్రమైన గండికోటలో అభివృద్ధి పనులు చేపట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం 70 కోట్లకు టెండర్లు పిలిచింది. ఈ టెండర్‌లను లెస్ వేసి రిత్విక్ కంపెనీ పేరుతో పోట్ల దుర్తి బ్రదర్స్ దక్కించుకున్నారు. ఇటీవల గ్రామంలో రితివ్క్ కంపెనీ గండికోట లో అభివృద్ధి పనులు చేపట్టడం కోసం యంత్రాలతో వెళ్లారు. స్థానిక శాసనసభ్యుడు ఆదినారాయణరెడ్డి స్థానిక నాయకులను రెచ్చగొట్టి పనులు అడ్డుకోవాలని సూచించారు. దీంతో స్థానిక నాయకులు పనులకు అడ్డు తగులుతూ వస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు మొదలు పెట్టగా రెండు సార్లు గ్రామస్తులు పనులు అడ్డుకున్నారు. చేసేదిలేక రిత్విక్ కంపెనీకి చెందిన ప్రతినిధులు ఎస్పీ, కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా ఉన్న అధికారులకు ఈ ఇద్దరి వివాదం తలనొప్పిగా మారిపోయింది. సోమవారం గండికోటలో పోలీసు బందోబస్తు మధ్య పనులు చేస్తున్న కంపెనీని సాయంత్రం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానికులు పనులు అడ్డుకున్నారు. కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం చందంగా.. స్థానికంగా ఇబ్బందులకు గురి అవుతున్నామంటూ అధికారులు వాపోతున్నారు.



పనులను అడ్డుకుంటున్న స్థానికులు

గతంలోనూ అంతే..

గతంలో వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం మండలంలో టి.కోడురు పంచాయతీ పరిధిలో అదాని గ్రూప్ సోలార్ పవర్ ప్రాజెక్టు పనులకు ఎంపీ రమేష్‌నాయుడు దక్కించుకున్నారు. ఈ పనులు ప్రారంభించడానికి వెళ్లిన అధికారులపై దాడులు చేసి భయందోళనకు గురి చేశారు. అప్పట్లో ఈ దాడి సంచలనంగా మారింది. అనకాపల్లి ఎంపీ రమేష్ నాయుడు సీరియస్‌గా తీసుకోవడంతో అధికారులు సైతం అలర్టు అయ్యారు. పనులు చేపట్టడం కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పనులు చేపట్టారు. అలాగే ఇటీవల స్థానిక రైతులకు అదనంగా పరిహారం ఇస్తామన్న హామీని అమలు చేయనందున దానికోసం కంపెనీ ముందు ధర్నా నిర్వహించే విధంగా దేవగుడి సోదరులు పావులు కదిపారు. సీఎంఓ కార్యాలయం నుంచి పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు రావడంతో హుటాహుటిన డీఎస్పీ స్థానిక పోలీసులతో వెళ్లి స్థానిక నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో స్థానిక నాయకులు ధర్నాను విరమించుకున్నారు. అదేవిధంగా ముద్దనూరులో సీఎం సురేష్ నాయుడు వర్గం బ్రాందీషాపు చేజిక్కించుకున్నారు. బ్రాందీషాపు ప్రారంభించటానికి రూములు అద్దెకు ఇవ్వకూడదంటూ ఆదినారాయణరెడ్డి వర్గానికి చెందిన ఓ నాయకుడు భయపెట్టడంతో స్థానికులు బ్రాందీషాపులకు రూములు అద్దెకు ఇవ్వలేని పరిస్థితి ఎర్పడింది. చివరకు బ్రాందీ షాపుకు తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అయితే సురేష్ నాయుడు అప్పటి ఎస్పీని కలిశారు. దీంతో సీరియస్‌గా తీసుకున్న అధికారులు కంటైనర్‌లో బ్రాందీషాపును మొదట ప్రారంభింపజేశారు.

స్థానికంగానే అమ్మవారి భూ వివాదం...

పోట్లదుర్తి గ్రామంలో ఉన్న పెద్దమ్మ అమ్మవారుకు సంబంధించిన భూములు, అభివృద్ధి విషయంతో పోట్లదుర్తి బ్రదర్స్, ఆదినారాయణరెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణ ఎర్పడింది. ఎంపీ నిధులకింద అమ్మవారి ప్రాంగణం అభివృద్ధి చేయాలని సీఎంసురేష్ నాయుడు ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. అయితే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు పనులు అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య రాళ్లతో దాడులు చేసుకున్న పరిస్థితి ఏర్పడింది. ఇలా ప్రతి విషయంలో పోట్లదుర్తి, దేవగుడి వర్గీయుల మధ్య పనులు విషయంలో ఆధిపత్యం కొనుసాగుతూనే ఉంది. తన నియోజకవర్గంలో పోట్లదుర్తి బ్రదర్స్ పెత్తనం ఏమిటంటూ ఆదివర్గం, అధికార పార్టీలో ఉన్న తమ పనులే అడ్డుకుంటార అంటూ పోట్లదుర్తి బ్రదర్స్ పోటా పోటీ పెత్తనం చెలాయిస్తున్నారు. వీరి మధ్య స్థానకంగా ఉన్న అధికారులు ఎవరికి సర్దుబాటు చేయలేక నలిగిపోతున్నారు. మరి ఉన్నతాధికారులు.. ఆయా పార్టీ పెద్దలు ఎలా ముందుకెళతారో కాలమే నిర్ణయిస్తుంది.

ఆలకించరు..ఆదుకోరు

- ప్రతి సోమవారం కలెక్టరేట్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- బాధితులకు తప్పని ఇబ్బందులు

రాయచోటి టౌన్/ సంబేపల్లె : అనేక బాధలు వెంటాడుతున్నాయి.. కష్టాలు మెండుగా ఉన్నాయి.. ఎన్ని పోరాటాలు చేసినా, ఎంత ఆవేదన వెలిబుచ్చినా న్యాయం దొరకక వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి బాధితులు పరుగులు తీస్తున్నారు. అయినా పరిష్కారం దొరకకడంలేదు. పదే పదే తిరుగుతున్నా ఫలితంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని మూరుమూల ప్రాంతాల నుంచి కూడా ప్రతిసోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎన్నెన్నో కష్టాలు, మరెన్నో అవస్థలు పడి ఇక్కడికి వస్తున్నారు.

న్యాయం చేయండి సారూ..



వీరి పేర్లు మార్గాని గంగులప్ప, మార్గాని నారాయణమ్మ.వీరిది అన్నమయ్య జిల్లా బి. కోత్తపేట. వీరికి ఒక కొడుకు ఉండే వాడు. రెండు సంవత్సరాల క్రితం చనిపోయాడు. కోడలు కూడా వెళ్లిపోయింది. దీంతో ఒంటరిగా జీవిస్తున్నారు.వీరికి 4.43 ఎకరాల భూమి ఉంది. దానిని సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతని తమ్ముడు భూమిని అక్రమించుకొనేందుకు సాగు చేసుకోవడానికి వీలు లేకుండా ఇబ్బంది పెడుతున్నాడు. మేము చనిపోతే అడిగే వారు ఎవరూ ఉండరని భావించి అటువైపు రానీయకుండా భయపెడుతున్నాడు. ఈ భూమిని మాకు దక్కేటట్లుగా చేయాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చామని చెబుతున్నారు.కలెక్టర్‌కు రెండు సార్లు ఫిర్యాదు చేశాం. అయినా ఫలితం లేదంటున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని వేడుకొంటున్నారు.

నా భూమిని ఆక్రమించారు



నా పేరు ముత్తన శ్రీరాములు, అన్నమయ్య జిల్లా బి. కోత్తపేట, నామాలపల్లె. మాకు పూర్వీకుల నుంచి మాకు 2.63 ఎకరాల భూమి ఉంది. దానిని మా తాత, మా నాన్న, ఇప్పుడు నేను సాగు చేసేవాడిని. అయితే కొంత కాలంగా ఆరోగ్యం బాగాలేక ఆ భూమిని సాగు చేయడంలేదు. దీంతో మా ఊరికి చెందిన ఇద్దరు వ్యక్తులు భూమిని ఆక్రమించారు.దీనిపై ఇప్పటి వరకు మూడు సార్లు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశాం. అధికారులు వస్తారు..భూమిని చూస్తారు...అయినా భూమి మాకు దక్కలేదు. ఇప్పటికైన కలెక్టర్ స్పందించి మాకు న్యాయం చేయాలి.

క్లుప్తంగా

తండ్రిపై తనయుడి దాడి

మదనపల్లె రూరల్ : మద్యానికి డబ్బు ఇవ్వలేదని తండ్రిపై తనయుడు దాడి చేసిన సంఘటన మదనపల్లె మండలంలో సోమవారం రాత్రి జరిగింది. కొత్తపల్లె పంచాయతీ ఈశ్వరమ్మకాలనీకి చెందిన షేక్‌గౌస్ సాహెబ్(65) వద్ద పెన్షన్ డబ్బు ఉంది. ఆ డబ్బు మద్యం తాగేందుకు కుమారుడు షేక్‌షైపుల్లా అడిగాడు. డబ్బు ఇవ్వడానికి నిరాకరించడంతో కర్రతో తండ్రిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడిని స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రమణ (ఫైల్)

కేవీపల్లె : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గ్యారంపల్లెలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. గ్యారంపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన గండికోట రమణ (50) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంలో పక్క గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే చిత్తూరు – కడప జాతీయ రహదారిలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని చీకటిలో గమనించకపోవడంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయన్ను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు.

తహసీల్దారు సంతకాలు ఫోర్జరీ

నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

కలికిరి : తహసీల్దారు సంతకాలు ఫోర్జరీ చేసి కోర్టుకు తప్పుడు ధ్రువీకరణ అందచేసినట్లు నిర్ధారణ కావడంతో నిందితునికి ఏడేళ్ల జైలు శిక్ష, ఇరవై వేలు రూపాయల జరిమానా విధిస్తూ వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ తీర్పునిచ్చారు. పోలీసుల కథనం మేరకు... కలికిరి పంచాయతీ వెంకటేశ్వరపురంలో నివాసం ఉండు ముల్లంగి రమేష్, గడ్డం శ్రీనివాసులుకు నివాస స్థలం విషయంలో తగాదాలున్నాయి. 2017లో గడ్డం శ్రీనివాసులు అప్పటి తహసీల్దారు సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ ఎంజాయ్‌మెంట్ ధృవీకరణ పత్రాన్ని పొందాడు. దీంతో గడ్డం శ్రీనివాసులు పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ పురుషోత్తంరెడ్డి కేసు నమోదు చేశారు. ప్రస్తుతం విచారణ తుదిదశకు చేరుకుని పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు నిందితునికి శిక్ష విధుస్తూ తీర్పునిచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్ కేసును వాదించారు. కేసుకు సంబంధించి సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచిన సీఐ అనీల్‌కుమార్, కోర్టు కానిస్టేబుల్ రెడ్డెప్పలను డీఎస్పీ క్రిష్ణమోహన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.

పలు రైళ్లు ఇక హాల్టింగ్

- ఆదేశాలు జారీ చేసిన రైల్వే శాఖ
- నందలూరులో ఆగనున్న జయంతి


జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు

రాజంపేట : దక్షిణ మధ్య రైల్వేలో పలు రైళ్లకు హాల్టింగ్స్‌ను పునరుద్ధరిస్తూ సౌత్‌సెంట్రల్ రైల్వే సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌లలో పలు రైళ్ల హాల్టింగ్స్‌కు రైల్వేబోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 10 నుంచి 12163(చెన్నై–ముంబై సూపర్) నంబరు గల రైలుకు కోడూరులో హాల్టింగ్ ఇచ్చారు. 16351(ముంబాయి–నాగర్‌కోయల్) నంబరు గల రైలు రాజంపేట, రైల్వేకోడూరు రైల్వేస్టేషన్లలో ఈ నెల 12న నుంచి హాల్టింగ్ ఉంది.

16352 (నాగరకోయిల్ –ముంబాయి)నంబరు గల రైలుకు రాజంపేట, రైల్వేకోడూరులో ఈ నెల 11 నుంచి హాల్టింగ్ ఇచ్చారు. 16381/16382 నంబరు గల జయంతి రైలు నందలూరు, కోండాపురంలో ఈ నెల 10 నుంచి హాల్టింగ్ ఉంది. 17415/17416 నంబరు గల (తిరుపతి–కోల్హాపూర్) రాజంపేట, ఓబులవారిపల్లెలో హాల్టింగ్ ఇచ్చారు. ఈనెల 10 నుంచి ఈ హాల్టింగ్ అమలులోకి రానున్నది. 17622 నంబరు గల(గుంటూరు–తిరుపతి) రైలుకు ఎర్రగుంట్లలో ఈ నెల 13 నుంచి హాల్టింగ్ ఇచ్చారు. 17652 (కాచిగూడ –చెన్నై ఎగ్మోర్) నంబరు గల రైలుకు కోడూరు రైల్వేస్టేషన్‌లో ఈ నెల 11 నుంచి హాల్టింగ్ కొనసాగనున్నది. 18521/18522 నంబరు గల నందలూరు రైల్వేకేంద్రంలో తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు ఈనెల 10 నుంచి హాల్టింగ్‌ను ఇచ్చారు. 20953/ 54(చెన్నై–అహమ్మదాబాద్) నంబరు గల రైలు రాజంపేట, రైల్వేకోడూరులో ఈ నెల 13 నుంచి హాల్టింగ్ ఉంది. 22102 నంబరు గల (ముంబాయి–మధురై.వీక్లీ) రైలుకు రాజంపేటలో ఈనెల 19 నుంచి హాల్టింగ్ ఇచ్చారు. 22157 /22158 (ముంబాయి–చెన్నై ఎగ్మోర్ సూపర్‌ఫాస్ట్ మెయిల్) నంబరు గల రైలుకు రాజంపేట, రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌లో ఈ నెల 10 నుంచి హాల్టింగ్‌ను ఇచ్చారు.

ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో..

జిల్లాలో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, రాజంపేట రైల్వేస్టేషన్‌లలో పలు రైళ్ల హాల్టింగ్స్ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కృషితో మంజూరైనట్లుగా గుంతకల్ రైల్వే డీఆర్‌యుసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి ఇక్కడి విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి రైల్వేశాఖ మంత్రితోపాటు, దక్షిణమధ్య రైల్వే జీఎంలకు హాల్టింగ్స్ విషయంపై తెలియచేయడం జరిగిందన్నారు. ఎంపీ తరఫున తాను కూడా జీఎంను కలిసి ఎంపీ మిథునరెడ్డి సహకారంతో వినతులను అందజేశామన్నారు నందలూరు రైల్వేకేంద్రంలో జయంతి ఎక్స్‌ప్రెస్‌రైలుకు హాల్టింగ్ ఇవ్వడం జరిగిందన్నారు.

వాటర్‌షెడ్‌లో నిధుల దుర్వినియోగం

- కాంట్రాక్టర్లతో అధికారుల కుమ్మక్కు
- పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వాటర్‌షెడ్ చైర్మన్


చెరువులో ఒకే చోట పక్క పక్కనే చేపట్టిన పాండ్స్ పనులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మడుమూరు పంచాయతీలో వాటర్‌షెడ్ ద్వారా జరుగుతున్న పనులు, నిధుల దుర్వినియోగంపై వాటర్‌షెడ్ చైర్మన్ మొరుంపల్లి శ్రీనివాసులు సోమవారం పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సంపతికోట మైక్రో వాటర్‌షెడ్ పరిధిలోని మడుమూరు పంచాయతీలో డకోట పాండ్స్, ఎంపీటీ లాంటి పనులను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారన్నారు. చెరువులు, ఏరు లాంటి ప్రదేశాల్లో పనుల నిషేధం ఉన్నా వాటర్‌షెడ్ సిబ్బంది కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారన్నారు. అంతేగాక చెరువులోనే ఒకే చోట పనికి, మరో పనికి మధ్య కేవలం 30 మీటర్ల దూరంలోనే మూడు డకోట పాండ్స్ పనులు చేపట్టడం నిధుల దుర్వినియోగానికి అద్దం పడుతోందన్నాడు. వాటర్‌షెడ్‌లో పని చేసే ఇద్దరు సిబ్బంది పనుల మంజూరు కోసం తన వద్ద ఆరు సంతకాలు పెట్టించుకున్నారన్నాడు. అదే విధంగా దొడ్డిదారిలో బిల్లులు చేసుకునే నేపథ్యంలో, మరిన్ని సంతకాల కోసం తనతో పాటు కమిటీ సభ్యులను సైతం వెంటపడి అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని అసహనం వ్యక్తం చేశాడు. ప్రజలకు ఉపయోగకరంగా చేపట్టాల్సిన పనులను అధికారులు లోపాయికారి ఒప్పందాల కారణంగా నిధులను నీళ్లలా ఖర్చు చేస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని ఆరోపించాడు. ఇటీవల కాలంలో పక్క మండలానికి చెందిన ఓ వ్యక్తికి, స్థానికంగా ఉన్న పలువురికి పనుల విషయంలో ఘర్షణ జరగ్గా స్థానికేతరుడికి రక్త గాయాలు అయినట్లు పేర్కొన్నాడు. వాటర్‌షెడ్‌లో ప్రజాధనం దుర్వినియోగానికి కారకులైన అధికారుల నుంచి నిధులను రికవరీ చేయించి ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని తాను కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో కోరినట్లు తెలిపాడు.

వృద్ధుడిపై పిచ్చికుక్క దాడి

మదనపల్లె రూరల్ : వృద్ధుడిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన సోమవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. చెర్లోపల్లి పంచాయతీ చిలకుంట గ్రామానికి చెందిన రెడ్డప్పనాయుడు(70) ఇంటి ముందు కూర్చొని ఉండగా, అదే సమయంలో అటుగా వచ్చిన పిచ్చి కుక్క ఆయనపై దాడి చేసి, తీవ్రంగా కరిచి గాయ పరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితున్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు.

రిటైర్డ్ ఏఎస్పీకి ఘన వీడ్కోలు


పదవీ విరమణ పొందిన ఏఎస్ఐను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : పోలీసు వేసిన ప్రతి అడుగు, ధరించిన యూనిఫామ్, కృషి, క్రమశిక్షణ, నిజాయతీలన్నీ పోలీసు శాఖ చరిత్రలో నిలిచిపోతాయని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. పదవీ విరమణ పొందిన స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ నాయబ్ ఉస్మాన్ ఘనీ ఖాన్‌కు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఘనమైన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. చట్టం, ప్రజల కోసం పోలీసులు చేసిన త్యాగం అమూల్యమైందని ఏఎస్పీ అభిప్రాయపడ్డారు. విధి నిర్వహణ సమయంలో కుటుంబం చూపిన సహనం, మద్దతు కూడా ప్రశంసనీయమన్నారు. అనంతరం ఏఎస్ఐను అదనపు ఎస్పీ ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి రాజారమేష్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎం చంద్రశేఖర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం తులసీరామ్, ఆర్ఐలు విజె రామకృష్ణ, ఎం పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు


గాయపడిన రేవతి

మదనపల్లె రూరల్ : బైక్ అదుపుతప్పి ఇద్దరు గాయపడిన సంఘటన సోమవారం చౌడేపల్లె మండలం బోయకొండలో జరిగింది. తమిళనాడు గుడియాత్తం భువనేశ్వర్‌పేటకు చెందిన భార్యాభర్తలు షణ్ముగం (45), రేవతి(39) బంధువుల శుభకార్యం కోసం సోమవారం బోయకొండ ఆలయానికి వెళ్లారు. తిరిగి ద్విచక్రవాహనంలో కిందకు దిగుతుండగా, బైక్ అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. రేవతి తీవ్రంగా గాయపడగా షణ్ముగంకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

8 మందిపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగర శివారులోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 7న గంజాయి, మందు బ్యాచ్‌లు దాడి చేయడంతో ముగ్గురు గాయపడ్డారు. నిందితులు కారును ధ్వంసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

జిల్లా స్కూల్ గేమ్స్ షెడ్యూల్ విడుదల

ఈనెల 10 నుంచి 17 వరకు ఎంపికలు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర సీఎస్ఈ నుంచి విడుదలైన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10 నుంచి 17 వరకు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఎంపికలు వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి తెలిపారు. ఈ విషయమై సోమవారం కడప డీఈఓ కార్యాలయంలో ఏడీ రామకృష్ణ ఆధ్వర్యంలో షెడ్యూల్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గేమ్స్ షెడ్యూల్ ఇలా..

తేదీ	గేమ్	ఎంపిక స్థలం
10-9-25	ఫెన్సింగ్	ప్రొద్దుటూరు
	కరాటే	రాజంపేట
	మాల్‌కబ్	మైదుకూరు
	బీచ్ వాలీబాల్	కమలాపురం
11-09-15	ఆర్చరీ	వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్, కడప
	ఫుట్‌బాల్	
	సైక్లింగ్	
	వెయిట్‌లిఫ్ట్	
	బాక్సింగ్	
	మోడరన్ పెంటాథ్లాన్	
	జిమ్నాస్టిక్	
	స్విమ్మింగ్	
12-09-25	కురాష్	డీఎస్ఏ స్టేడియం, కడప
	వుషు	
	థాంగ్ టా మార్షల్ ఆర్ట్	
	స్కేటింగ్	
	టెన్నీస్	
	టేబుల్ టెన్నిస్	
	సాఫ్ట్ టెన్నిస్	
15-09-25	రెజ్లింగ్	డీఎస్ఏ స్టేడియం, కడప
	జుడో	
	సెపక్ తక్రా	
	నెట్‌బాల్	రాజంపేట
16.09.25	తైక్వాండో	పోరుమామిళ్ల
	రగ్బీ	పులివెందుల
	షూటింగ్	కడప
17-09-25	గట్కా	జెడ్పీ హైస్కూల్, సిద్దవటం
	కలరిపయట్టు	

మల్టీ డే మ్యాచ్‌లో చిత్తూరు, నెల్లూరు విజయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్‌జోన్ అండర్–23 మల్టీడే మ్యాచ్‌లు ఉత్సాహంగా కొనసాగాయి. సోమవారం రెండవ రోజు వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై చిత్తూరు జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 132 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 55.3 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని తేజరెడ్డి 142 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లతో అద్భుతంగా ఆడి 106 పరుగులు చేశాడు. రెడ్డి ప్రకాశ్ 30 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని ప్రమోద్ కుమార్ 3, ప్రవీణ్‌కుమార్ సాయి 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 46.2 ఓవర్లకు 142 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని నిస్కయ్ 47, ప్రవీణ్ కుమార్ సాయి 32 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని అచ్యుతానంద అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. రెడ్డి ప్రకాశ్ 2, బ్రహ్మసాయి తేజ్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. తర్వాత రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 14.5 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. ఆ జట్టులోని తేజరెడ్డి 52, జెనిక్ దాస్ 34 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని భార్గవ 2 వికెట్లు తీశాడు. దీంతో చిత్తూరు జట్టు 8 వికెట్ల తేడాతో రెండవ రోజే విజయం సాధించింది.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టుపై నెల్లూరు జట్టు 69 పరుగుల తేడాతో విజయం సాధించింది. సోమవారం రెండవ రోజు 140 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 86.1 ఓవర్లలో 501 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 167, సోహన్ వర్మ 68, మాధవ్ 66, శ్రీ హర్ష 58 పరుగులు చేశారు. కడప జట్టులోని ఎస్ఎండీ ఆయూబ్ 4, వరుణ్‌తేజ్‌రెడ్డి 4, చెన్నారెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 33.1 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని శివ కేశవ రాయల్ 53, నాగ చాతుర్య 33 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని అఖిల్ 5, నారాయణ 2, సూతేజ్‌రెడ్డి 2 వికెట్లు తీశారు.

పేరు రైతుది.. పని రియల్టర్లది!

- వ్యవసాయ అనుమతులతో మాయాజాలం
- చెరువు మట్టిని దండుకుంటున్న మాఫియా

కురబలకోట : వ్యవసాయ భూముల అభివృద్ధి పేరుతో చెరువు మట్టి తోలుకోడానికి ఇరిగేషన్ ఈఈ నుంచి అనుమతి తీసుకుని రియల్టర్ భూమిని చదును చేసుకుంటున్నారు. దీనిపై చెరువు ఆయకట్టుదారులు, గ్రామస్తులు మండిపడుతున్నారు. మండలంలోని నార్లపల్లె చెరువులో నాలుగు రోజులుగా జేసీబీలు, టిప్పర్లతో చెరువు మట్టిని పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. ఈ మట్టిని సర్కారు తోపు వద్ద ఉన్న చింతమాకులపల్లె సచివాలయం ఎదురుగా హైవే పక్కనున్న రియల్టర్ భూమి చదునుకు తోలుతున్నారు. ఈ విషయం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు తెలిసినా మౌనంగా ఉంటున్నారంటే.. వారు మట్టి మాఫియాకు ఎంతగా సహకరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అసలు ఇరిగేషన్ ఈఈ చెరువు మట్టి తోలుకోడానికి రియల్టర్లకు ఎలా అనుమతి ఇస్తారని గ్రామస్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ ఈఈ మట్టి మాఫియా కొమ్ముకాసి మట్టి తోలుకోడానికి అనుమతి ఇచ్చారని ఆయకట్టుదారులు దుయ్యబడుతున్నారు. ఆయన నిర్వాకంపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు ఆయకట్టు రైతులు సోమవారం తెలిపారు.

ఈ విషయమై సోమవారం ఇరిగేషన్ అధికారులను విచారణ చేయగా వ్యవసాయ భూముల అభివృద్ధికి అనుమతి తీసుకుని చెరువు మట్టితో రియల్ భూములను చదును చేసుకుంటున్నట్లు విచారణలో తేలడంతో పనులను నిలుపుదల చేయించినట్లు తెలిపారు. బాధ్యులపై తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఇమామ్, మౌజన్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మదనపల్లె నియోజక వర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్

రాయచోటి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఇమామ్, మౌజన్లకు ఇవ్వాల్సిన పెండింగ్ గౌరవ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర విభాగం పిలుపులో భాగంగా మైనార్టీ విభాగం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మీడియాతో మాట్లాడుతూ మైనార్టీలకు గౌరవేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ మాట పూర్తిగా మరిచిపోయిందన్నారు. ఓట్లు వేయించుకునే వరకు ఒక విధంగా మాట చెప్పిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తరువాత మీరు మాకెందుకు అన్న విధంగా ప్రవర్తిస్తోందని విమర్శించారు. అదే వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇమాంలకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేలు ప్రతి నెల ఇచ్చేవారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేలు గౌరవ వేతనం ప్రతినెల చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ జనవరి నుంచి ఇప్పటి వరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. సెప్టెంబరు వరకు ఎనిమిది నెలల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గతేడాది ఎన్నికల సమయమైన ఏప్రిల్, మే, జూన్ నెలల వేతనాలు కూడా చెల్లించలేదన్నారు. ఇలా 11 నెలల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. దీనివల్ల ఇమామ్, మౌజన్లు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. మసీదు కమిటీలు కూడా ఈ చెల్లింపులను భరించలేకపోతున్నాయన్నారు. జనవరి నుంచి సెప్టెంబరు వరకు ఉన్న పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెల క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని కోరారు. నూర్‌బాషా కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లెలో 20 ఏళ్ల క్రితం తెలుగు దేశం పార్టీనే షాదీ మహల్ నిర్మాణం కోసం అరకొరగా నిధులు కేటాయించడంతో అది ఆదిలోని ఆగిపోయిందన్నారు. తరువాత దీనిని విస్మరించారని చెప్పారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి షాదీమహల్ పూర్తి చేయాలని, త్వరగా పూర్తి చేస్తే నిరుపేదలు ఉపయోగించుకొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్ బాషా, వైఎస్సార్ సీపీ మైనార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బేపారీ మహమ్మద్, రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, రాయచోటి మైనార్టీ నాయకుడు జాఫర్ ఆలీఖాన్, మదనపల్లెకు చెందిన యూనస్, రహ్మతుల్లా, షఫీభాయ్, జబీవుల్లా, యాసీన్, తాజ్ భాయ్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై విజిలెన్స్ దాడులు


వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులనే నెపంతో..


రేషన్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు అనే నెపంతో మండలంలోని 19, 25, 26 రేషన్ దుకాణాలపై సీఐ నారాయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ వెంకటరెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి ఏకకాలంలో దాడులు నిర్వహించి.. దుకాణాలలో ఎటువంటి చిన్నపాటి వ్యత్యాసాలు లేకుండానే ఆథరైజేషన్ లేదనే నెపంతో ఆరు కేసులు నమోదు చేయడం జరిగిందని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని మద్దిరేవుల గ్రామం రేషన్ షాప్ నెంబర్లు 25, 26, పందిళ్లపల్లి గ్రామ కస్బా రేషన్ షాప్ నెంబరు 19ను విజిలెన్సు అధికారులు తనిఖీలు చేపట్టడం జరిగింది. రేషన్ దుకాణాలలో బియ్యం, చెక్కర, అంగన్‌వాడీకి సంబంధించిన పామ్ ఆయిల్, కందిపప్పు, సన్నబియ్యంలలో చిన్నపాటి వ్యత్యాసాలు చూపెడుతూ కేసులు నమోదు చేసినట్లు రేషన్ డీలర్లు పేర్కొన్నారు. మండలంలోని 30 రేషన్ షాపులకు గత నాలుగేళ్లుగా ఆథరైజేషన్‌లు లేవనే విషయం సంబంధిత తహసీల్దార్‌కు తెలిపిన విషయమే అన్నారు. ఆథరైజేషన్‌లు ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఇవ్వాల్సి ఉన్నా తహసీల్దార్ రర్యాలయ సిబ్బంది పట్టించుకోకపోవడంతోనే పెండింగ్‌లో ఉన్న విషయం రెవెన్యూ సిబ్బందికి తెలుసునని వాపోయారు. ఇప్పుడేమో రేషన్ షాపులపై అధికార పార్టీ ఒత్తిడితో విజిలెన్సు అధికారులను పంపించి దాడులు చేయించడం, తమకు కోర్టు ఆర్డర్లు ఉన్నాయనే ఉత్తర్వులను విజిలెన్సు అధికారులు చూపించి, తమపై అసభ్య పదజాలాలు వాడుతూ బెదిరింపుకు దిగుతున్నారని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉన్న సరుకులను సంబంధిత వీఆర్‌ఓలకు అప్పగిస్తున్నామంటూనే అధికార పార్టీ సానుభూతి పరుల ఇళ్లలోకి రేషన్ బియ్యాన్ని తరలించడం జరుగుతోందన్నారు. కేవలం అధికార పార్టీ ఒత్తిడి వల్లే తమ రేషన్ షాపులపై విజిలెన్సు దాడులు చేయించడం జరుగుతుందని రేషన్ డీలర్లు వాపోతున్నారు.


గుప్త నిధుల కోసం ఆలయంలో తవ్వకాలు


వాలీశ్వర ఆలయం గోడను ధ్వంసం చేసిన దృశ్యం


ఆలయంలో జరిపిన తవ్వకాలు

రామసముద్రం : గుప్త నిధుల కోసం గుర్తుతెలియని దుండగులు త్రేతాయుగం నాటి ఆలయాన్ని ధ్వంసం చేసిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. భక్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆర్.నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీవాలీశ్వర ఆలయం త్రేతాయుగంలో అప్పటి వాలీ నిర్మించారు. ఆలయంలో ప్రతి సోమవారం పూజలు నిర్వహిస్తారు. వారం రోజులుగా కొండపైకి వెళ్లే దారిలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ఆర్.నడింపల్లి గ్రామానికి చెందిన భక్తులు మరమ్మతులు చేసేందుకు 10 మంది కొండపైకి సోమవారం ఉదయం వెళ్లారు. అయితే ఆలయ ముఖద్వారం వద్ద ఉన్న రాతి గోడను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించి స్థానికులకు సమాచారం అందించారు. అప్పటి కాలంలో నిర్మించిన పురాతన ఆలయానికి ఉన్న పెద్ద పెద్ద రాతి గోడలను నిధుల కోసం ధ్వంసం చేసి సొరంగం పెట్టారు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలియజేశారు. సంఘటన స్థలాన్ని సందర్శించని పోలీసులు మండలంలోనే ప్రఖ్యాతి గాంచిన అతి పురాతన ఆలయాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారన్న విషయంపై ఫిర్యాదు చేసినా.. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించకపోవడంపై స్థానికులు, భక్తులు అసహనం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఆలయం వద్ద ధ్వజస్తంభంను ధ్వంసం చేసి నిధులు దోచుకెళ్లిన దుండగులను గుర్తించలేదని వారు తెలిపారు. పురాతన ఆలయాన్ని గుప్త నిధుల కోసం తవ్వకాలకు పాల్పడిన ముఠాను పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

రైతు బిడ్డకు జాతీయస్థాయి పురస్కారం


కేంద్ర మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న జి.లక్ష్మీనారాయణరెడ్డి, కల్యాణి

వేముల : హైదరాబాద్‌లో కడప రైతు బిడ్డ గజ్జెల లక్ష్మీనారాయణరెడ్డి అరుదైన జాతీయ స్థాయి పురస్కారాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. వేముల మండలం కుప్పగుట్టపల్లె గ్రామానికి చెందిన గజ్జెల లక్ష్మీనారాయణరెడ్డి పదేళ్ల క్రితం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిఫార్సుతో టర్బో సర్వీసెస్ రంగంలో కేవలం రూ.1400 జీతంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2017లో కూకట్‌పల్లె కెపీహెచ్‌బీ కాలనీ కేంద్రంగా న్యూ ప్రీమియర్ టర్బో సర్వీసెస్ అనే సంస్థను స్థాపించాడు. ఓ టీవీ న్యూస్ చానెల్ తెలంగాణాలో నిర్వహించిన కార్యక్రమంలో బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులు ఈనెల 5వ తేదీన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతులమీదుగా గజ్జెల లక్ష్మీనారాయణరెడ్డి, ఆయన సతీమణి కళ్యాణిలు అందుకున్నారు.